అంబర్‌పేట ఫ్లై ఓవర్‌పై రయ్..రయ్..

- అనధికారికంగా రాకపోకలు షురూ..
- పూర్తికాని సర్వీసు రోడ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

గోల్నాక, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆర్భాటమూ లేకుండా అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు మహాశివరాత్రి రోజైన బుధవారం ప్రారంభం కావడంతో ప్రజలకు ట్రాఫిక్‌జామ్ నుంచి మోక్షం లభించింది. ఫ్లైఓవర్ నిర్మాణం పనులు మాత్రమే పూర్తికావడంతో వంతెనపై వాహనాల రాకపోకలు షురూ చేసి ప్రజల ఇబ్బందులకు కాస్త మోక్షం కల్పించారు. కింద సర్వీసు రోడ్లు పూర్తయ్యాక ఆర్భాటంతో ప్రారంభోత్సవం చేస్తామంటున్నారు. ఇప్పటికే ఏళ్ల తరబడిగా ఇబ్బందులు పడ్డామని... ఇకనైనా త్వరగా సర్వీసు రోడ్లను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి(163)పై అంబర్‌పేట ఛేనెంబర్, శ్రీరమణ చౌరస్తాలో సిగ్నల్ చిక్కులులేని ప్రయాణానికి రూ.467.55 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు 2018లో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణంలో అనేక సమస్యలతో ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికావడానికి ఏడేళ్లు పట్టింది. కానీ ఫ్లైఓవర్ కింద సర్వీసు రోడ్లు వివిధ సమస్యల మూలంగా పూర్తికాలేదు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంతో ఏడేళ్లుగా గోల్నాక, అలీకేఫ్‌రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కేంద్రమంత్రి ఆదేశాలతో బుధవారం ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలకు అధికారులు అనమతించారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రోడ్ల నిర్మాణంలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతున్నారు.


అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు


గోల్నాక నుంచి రైట్‌సైడ్ సర్వీస్ రోడ్డు నిర్మాణం కాకుండా ఉన్న దృశ్యం

ఒకవైపు నుంచి సర్వీసు రోడ్డు పూర్తిగా బంద్

గోల్నాక చర్చి నుంచి ఫ్లైఓవర్ కింద రెండువైపులా సర్వీసు రోడ్ల ద్వారా వాహనాల రాకపోకలు కొనసాగాల్సి ఉంది. రైట్‌సైడ్ సర్వీసు రోడ్డుకు ఒక మతానికి సంబంధించిన సమాధులు, ప్రార్థనామందిరం అడ్డుగా ఉన్నాయి. దీంతో ఆ రోడ్డుపూర్తిగా బంద్ ఉంది. దీంతో లెఫ్ట్‌సైడ్ నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో ఆ రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదకరంగా మారింది. రైట్‌సైడ్ సర్వీసు రోడ్డునూ త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. రైట్‌సైడ్ రోడ్డును పూర్తిచేయకుంటే ఈ ఫ్లైఓవర్ వల్ల ప్రయోజనం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు. కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతీసుకుని త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది


అడిక్‌మెట్‌లో అన్నదానం చేస్తున్న అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. గురువారం అడిక్‌మెట్ బౌద్ధనగర్ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఆర్యవైశ్య ఫెడరేషన్ సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుంటూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, చంద్రశేఖర్, నాయకులు సుధాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశ్వర్‌రావు, బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


త్రినాథరావును సన్మానిస్తున్న అరవింద్‌కుమార్‌యాదవ్, జానకి సుధాకర్

ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం చైర్మన్ జానకి సుధాకర్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఎస్‌బీఐ మాజీ ఏజీఎం సీహెచ్ త్రినాథరావుతో భక్తి సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. పలు భక్తి గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్ త్రినాథరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో మాచర్ల దేవనాథం, ధర్మకర్తలు శ్యామ్‌ముదిరాజ్, శిశుకుమార్, కాంగ్రెస్ సీనియర్ నేత జయేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బౌద్ధనగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కౌసర్ మసీదు, వారాసిగూడ, ఆర్ట్స్ కాలేజ్, బాలాజీ కమ్యూనిటీహాల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12, జామై ఉస్మానియా పరిధిలోని ఎస్‌బీహెచ్‌కాలనీ, లలితానగర్, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2, ఏపీఎస్‌ఈబీ ఈప పరిధిలోని ప్రాంతాల్లో 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఎర్రమంజిల్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతి క్షీరలింగేశ్వరస్వామి మందిరం వద్ద శివపార్వతుల కల్యాణమహోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున హాజరై మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు అర్చకులు కాశీనాథశర్మ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నివాసాల మధ్య ఉన్న వైన్‌షాప్‌లను తొలగించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య ఉన్న వైన్‌షాప్‌లను తొలగించాలని టీజేఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.రవీందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్, జవహర్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో వైన్‌షాప్‌లు నివాసాల మధ్య ఉన్నాయన్నారు. వీటి వల్ల స్థానికంగా ఆయా ప్రాంతాల్లో న్యూసెన్స్ జరుగుతోందని వాటిని ఇక్కడి నుంచి తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వైన్స్‌ను మూసివేయాలి లేదా ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ గతంలో పలుమార్లు ఆర్బీఐ క్వార్టర్స్ వాసులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారని ఆయన గుర్తుచేశారు. నిత్యం వైన్‌షాప్‌లలో మద్యాన్ని కొని అక్కడేఫుల్‌గా తాగి నివాసాలకు వచ్చేపోయే దారిలో అడ్డుగా పడిపోయి ఉండడం, వచ్చేపోయే అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. ఇటీవల మళ్లీ వైన్‌షాప్‌ల వద్ద న్యూసెన్స్ చేస్తున్నారని, దానివల్ల అమ్మాయిలకు, అబ్బాయిలకు, మహిళలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని రవీందర్‌యాదవ్ పేర్కొన్నారు. నివాసాల మధ్య వైన్‌షాప్‌లకు పర్మిషన్ ఇవ్వవద్దని ఆయన డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో రైలు ఢీకొని ఇద్దరి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ, యాకుత్‌పురా రైల్వే స్టేషన్ల నడుమ 60 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది .ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో ఫలక్‌నుమా శివరాంపల్లి రైల్వేస్టేషన్ల నడుమ 50 ఏళ్ల వయసు కల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు

'చర్చి ఆదాయానికి లెక్కలు చూపాలి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లోకల్ బాడీ పేరిట గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్‌చర్చిని నిర్వహించినవారు గత నాలుగు నెలల చర్చి ఆదాయం లెక్కలు చెప్పాలని చర్చి ట్రస్టు వైస్‌చైర్మన్ ఇమ్మాన్యుయేల్, సొసైటీ చైర్మన్ జాన్‌సుందరం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాఖలకు గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని హెబ్రోన్ చర్చి ప్రధానకార్యాలయమని వారు పేర్కొన్నారు. గురువారం చర్చి కార్యాలయంలో వారు మాట్లాడారు. చర్చి నిర్వహణ విషయంలో లోకల్‌బాడీ కమిటీకి ఎలాంటి అర్హత లేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు లోకల్‌వారిని కలుపుకుని తమకు ఇబ్బందిని కలిగిస్తున్నారని వారు ఆరోపించారు. రాగి వీరాచారి చర్చిసభ్యుడేనని వారు స్పష్టం చేశారు. 20 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా ట్రస్టు, సొసైటీల మధ్యనే కేసులు నడుస్తున్నాయని కానీ వ్యక్తిగతంగా కాదని వారు వివరించారు. ఇరువురం రాజీపడి చర్చి నిర్వహణను కొనసాగిస్తున్నామన్నారు. న్యాయస్థానం కూడా ట్రస్టు, సొసైటీ కలిసి చర్చి నిర్వహణ చేయాలని సూచించిందన్నారు. ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు కూడా తమకు సహకరించాలన్నారు. కోర్టులో కొనసాగుతున్న కేసులను సొసైటీ తరఫున వీరాచారి ట్రస్టు తరఫున వెంకటేశ్వరరావు చూస్తున్నారని వివరించారు.

అంకితభావం గల అధ్యాపకులను విద్యార్థులు మర్చిపోరు

హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఓ వడ్డన్న

బర్కత్‌పుర ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేసే అధ్యాపకులను వారు జీవితంలో మర్చిపోరని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఓ వడ్డన్న అన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లైబ్రేరియన్ కె.సురేష్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న పేదవిద్యార్థులు తమ పిల్లలుగా భావించి వారి అభివృద్ధికి అధ్యాపకులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. లైబ్రేరియన్ సురేష్ కుమార్ లాంటి అనుభవజ్ఞులు కొత్తవారికి తన సలహాలు, సూచనల అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ఆర్టీవో జాయింట్ కమిషనర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికీ సమాజం గుర్తిస్తుందని చెప్పారు. సురేష్ కుమార్ తక్కువ కాలంలో పరిచయం ఎంతో పేరు ప్రఖ్యాతిని సంపాదించుకున్నారని కొనియాడారు. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి సహకారాలు అందించడంలో సురేష్‌కుమార్ ముందుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లైబ్రేరియన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శివకుమార్, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రసాద్‌రావు ప్రధాన కార్యదర్శి బాలయ్య, హైదరాబాద్ జిల్లా లైబ్రరీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి.లక్ష్మయ్య, సీనియర్ లెక్చరర్స్ గీతాబాయి, రామ్మోహన్, అనిల్ రెడ్డి, రజిని, బాలమణి, రాజేందర్ పాల్గొన్నారు.


సురేష్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వడ్డన్న

మసీదుల వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలి

- యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని ఐషా ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మినాజ్ ఉద్దీన్ అహ్మద్ ఆధ్వర్యంలో రంజాన్ మాసంపై జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలోని 36 ప్రధాన మసీదులలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ... రంజాన్‌మాసం సందర్భంగా మసీదుల వద్ద స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అనంతరం అతిథులను డాక్టర్ మినాజ్ ఉద్దీన్ శాలువాలతో సన్మానించారు. నియోజకవర్గంలోని వివిధ మసీదులకు చెందిన నిర్వాహకులు అరవింద్‌కుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మోసిన్‌కురేషీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యద్ మోహిన్, మసూద్, నాయకులు జఫీర్ ఉద్దీన్, అల్లాఉద్దీన్, మహ్మద్ అఫ్రోజ్ పాల్గొన్నారు.


అరవింద్‌కుమార్ యాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మసీదుల మత పెద్దలు

ఆకట్టుకున్న చరణదాసు జానపద నాటకం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దోచుకున్న సొమ్మును జనాలకు పంచే దొంగగా పేరొందిన చరణదాసు జీవనాన్ని వివరిస్తూ సాగిన చరణదాసు నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గురువారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో చరణదాసు జానపద నాటకం ప్రదర్శించారు. భూమిక థియేటర్ గ్రూప్ సమర్పించిన ఈ నాటకానికి హబీబ్ తన్వీర్ మూల కథను అందించారు. దీనికి తెలుగు అనుసరణ, పాటలు, డిజైన్ దర్శకత్వం ఉదయభాను గరికపాటి అందించారు. మంచి చెడులు కలిసిన నడత రెండు కాళ్ల నడక లాంటిదనే ఇతివృత్తంగా సాగిన చరణదాసు నాటకం ఆహుతులను రంజింపజేసింది. చక్క టి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు. నవ్వులు పూయిస్తూ సాగిన నాటకం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమంలో పలువురు నాటక ప్రయోక్తలు పాల్గొని నటీనటులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరణదాసు వంటి నాటకాన్ని ప్రదర్శించడం సంతోషకరమని అన్నారు. రసరంజని సంస్థ ప్రతి నెలా నాటకం, ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం నినాదంతో ముందుకు సాగడం అభినందనీయమని పేర్కొన్నారు.


నాటకంలోని సన్నివేశం

భక్తిభావాన్ని చాటిన 'శివోహం'

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివోహం కార్యక్రమం ప్రేక్షకులకు భక్తిభావాన్ని పంచింది. గురువారం జరిగిన వేడుకల్లో కళాకారులు నిర్విరామంగా 8గంటలు కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్యం, సంగీతం, ఫ్లూట్, వయోలిన్ వాయిద్య కచేరీ, కర్ణాటక సంగీత కచేరీ తదితర కళారూపాలను ప్రదర్శించారు. చక్కటి నాట్యం, గానంతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించిన నర్తకులు ఆహుతులను రంజింపజేశారు. పలు భక్తిగీతాలు, సంకీర్తనలు ఆలపించిన గాయకులు శ్రోతల్ని మైమరిపించారు. కార్యక్రమంలో అతిథులుగా రాధాకుమారి, ప్రొఫెసర్ డా.ఆంజనేయులు, గాడిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిభావం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.


నాట్యం చేస్తున్న కళాకారులు

ఘనంగా లింగోద్భవ పూజలు


లింగోద్భవ పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సీతామార్కొండయ తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీలోని ప్రసిద్ధిగాంచిన సంజీవ హనుమాన్ దేవాలయంలో స్వామివారికి లింగోద్భవ మహాపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సీతామార్కొండయ, పుండరీకం, సంయుక్త కార్యదర్శి వినోద్, మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భవానీశంకర దేవాలయంలో సీపీ ప్రత్యేక పూజలు


భవాని శంకర ఆలయంలో పూజల్లో పాల్గొన్న సీపీ సీవీ ఆనంద్

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని భోలక్‌పూర్ డివిజన్ దోవుని తోటలోని 400 సంవత్సరాల చరిత్రగల భవానీశంకర ఆలయాన్ని నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ సిబ్బంది సురేష్ కుమార్, ఆర్.శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడికి సన్మానం

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయా(ఎంజీయూ)నికి స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మహ్మద్‌షకీల్‌ను భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అబ్రార్ హుస్సేన్ సన్మానించారు. గురువారం హైకోర్టులో మహ్మద్ షకీల్‌ను కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అబ్రార్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధ్యక్షుడు మహ్మద్ షకీల్ ముస్లింల న్యాయమైన హక్కుల సాధనకు కృషిచేస్తున్నారని అన్నారు.


మహ్మద్ షకీల్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు అబ్రార్ హుస్సేన్

యూపీహెచ్‌సీకి వాటర్ పంప్‌సెట్ వితరణ


ముషీరాబాద్ పీహెచ్‌సీకి వాటర్ మోటార్‌ను అందజేసిన డాక్టర్ హిప్నో పద్మాకమలాక్, కొప్పుల విజయ్ కుమార్ తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎన్‌జీవో డేను పురస్కరించుకుని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)కి వాటర్ మోటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ విజయ్‌కుమార్, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, సతీష్, మనోజ్, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడిగా పూస గోరక్‌నాథ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పూసగోరక్‌నాథ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విషయం వివరించారు. ఆయనను అభినందిస్తూ ఎమ్మెల్యే ముఠాగోపాల్ గోరక్‌నాథ్‌ను సన్మానించారు.


పూసగోరక్‌నాథ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

యువకుడి అదృశ్యం

బౌద్ధనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడ బ్రాహ్మణబస్తీకి చెందిన ఎం.విక్రమ్(27) డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఈనెల మూడో తేదీన 12:30 గంటలకు విక్రమ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో అతని కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తండ్రి ఎం.శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఎం.విక్రమ్ (ఫైల్)

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

రాంగోపాల్‌పేట్: పేకాట ఆడుతున్న జూదగాళ్లను గురువారం తెల్లవారు జామున అరెస్ట్ చేసిన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం... శివరాత్రి రోజు అర్ధరాత్రి కళాసీగూడ రాజా ముదలియార్ స్ట్రీట్‌లోని ఓ ఇంటిపై ఏడుగురు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం ఎస్సై పరదేవీ జాన్ అందుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై దాడిచేశారు. ఏడుగురు జూదగాళ్లను పట్టుకుని వారి నుంచి రూ.20,030 నగదును, ప్లేయింగ్ కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెక్షన్ 9(ఐ) టీఎస్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు.